క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాల భోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

చెట్టు కొమ్మలు తొలగించండి



ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో పడి ఉన్న చెట్టు కొమ్మలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో చెట్టు కొమ్మలు అడ్డుగా పడి ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల కిందట భారీగా వీచిన గాలులకు రాత్రి పూట చెట్టు కొమ్మ కూలిపోయి హెచ్‌ఎం గదికి ఎదురుగా పడి ఉంది. జీవీఎంసీ సిబ్బంది కొమ్మలు కొట్టి చెక్కలు పట్టుకుని వెళ్లిపోయారు. చెట్టు కొమ్మలు వదిలేయడంతో భోజనాల సమయంలో ఇబ్బందిగా ఉంటోందని, వాటిని వెంటనే తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

తులసి మొక్కల పంపిణీ

సీతంపేట: అక్కయ్యపాలెం జాతీయ రహదారి పక్కన శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభమైన చలివేంద్రం వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం చలివేంద్రం నిర్వహణకు సహకరించిన దాతలకు తులసి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ సునీత కొటారి, మానేపల్లి లక్ష్మి, సరిపల్లి భాస్కరమ్మ, నాగలక్ష్మి, సాహిత్య, విజయ, సురేష్, రాధ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన వీణా కచేరి



వీణా నాదన చేస్తున్న తేజస్వి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక వీణా కచేరి ఆహుతులను అలరించింది. డాక్టర్ రామవరపు మాధురి దేవి శిష్యురాలు వల్లభజోస్యుల తేజస్వి వీణపై ముత్తయ భాగవతార్, త్యాగరాజ, శ్యామశాస్త్రి, వాసుదేవాచార్య రచించిన శ్రీసకల గణాధిప, వియంభకే, భజన సేయవే, పార్వతి నుసునే, మమావతు శ్రీ సరస్వతి, సరసమదన, ఫరాజ్ థిల్లానా కీర్తనలు అద్భుతంగా వినిపించారు. ఈమెకు పి.వి.ఎస్.బాలాజీ యువరాజ్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షించారు.

ఎస్ఈ రాజారావుకు నివాళి



రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, అధికారులు

మహారాణిపేట: విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన ప్రజారోగ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) కె.రాజారావు సంస్మరణ సభ శుక్రవారం సీతమ్మధారలో జరిగింది. ఆయన చిత్రపటానికి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. టిడ్కో ఎస్ఈ నరసింహమూర్తి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ రామిరెడ్డి, వుడా సీఈ ఇ.శివప్రసాద్‌రాజు, పబ్లిక్ హెల్త్ ఏఈ గణపతిరావు, జీవీఎంసీ, ఇంజినీర్, ఇతర అధికారులు నివాళులర్పించారు.

'జగనన్న సురక్ష'తో సులువుగా ధ్రువపత్రాలు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ కామేశ్వరి, జెడ్పీ కృష్ణ

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 47వ వార్డులో లబ్ధిదారులకు 708 ధ్రువపత్రాల అందజేత

కంచరపాలెం: అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాలు అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని 259, 260, 270, 274, 275 సచివాలయాల పరిధిలో 956 దరఖాస్తులు రాగా.. 708 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా చాలా సులువుగా అనేక రకాల సర్టిఫికెట్లను అర్హులంతా పొందుతున్నారని చెప్పారు. తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత సాధిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ అనేక కార్యక్రమాలను రూపొందిస్తున్నారని, ప్రజలంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని కె.కె.రాజు కోరారు.

లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంచి అవకాశంగా భావించి ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జోన్-5 పరిధిలో జరుగుతున్న ఈ కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. ధ్రువపత్రాలు అందుకుంటున్న లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని జెడ్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయ, స్పెషల్ ఆఫీసర్ ఈఈ శ్రీనివాస్, ఏఈ మోహన్, పార్టీ సీనియర్ నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, విజయ్, గురువోజీ, రాఘవులు, రమణ, పి.సాయి, సురేష్, కృపా, భోగి, నరసింగ్, నాగరాజు, వాసు, రమేష్, జయకుమార్, లక్ష్మణ్, గోపి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాస్ట్ సర్టిఫికెట్ అందుకున్నా..



కుల ధ్రువపత్రాం కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. అది లేకపోవడంతో కళాశాలలో చాలా ఇబ్బంది పడేదాన్ని. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవి కావు. వారం రోజుల కిందట దరఖాస్తు చేస్తే జగనన్న సురక్ష క్యాంప్‌లో నాకు సర్టిఫికెట్ అందించారు. చాలా ఆనందంగా ఉంది.

– పూజిత, సంజీవయ్య కాలనీ

రెండు రోజుల్లోనే ధ్రువపత్రాలు



వలంటీర్ల సేవలు చాలా బాగున్నాయి. ఇప్పుడు జగనన్న సురక్ష ద్వారా రెండు రోజుల్లోనే ఆదాయ, కుల ధ్రువపత్రాలను అందుకున్నాను. నా చదువుకు ఈ రెండు సర్టిఫికెట్లు లేకపోవడంతో ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ తిరిగే వాడిని. సురక్ష క్యాంప్‌లో వీటిని అందుకోవడం సంతోషంగా ఉంది.

– శ్రీకాంత్, కప్పరాడ

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ఎక్కడికీ తిరగకుండానే నాకు ధ్రువపత్రాలు వచ్చాయి. నా పిల్లల బర్త్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల కొన్ని ప్రభుత్వ పథకాలు పొందలేక పోయాను. జగనన్న సురక్ష ద్వారా ఈ ధ్రువపత్రాలను అందుకుని పథకాలకు అర్హత సాధించాను. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– పద్మజ, రాంజీ ఎస్టేట్

రైల్వే బాక్సర్లకు శిక్షణ ప్రారంభం



శిక్షణలో పాల్గొన్న బాక్సర్లతో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

విశాఖ స్పోర్ట్స్: రైల్వేస్ బాక్సర్లకు శిక్షణ శిబిరం ఈకోర్స్ వాల్తేర్ రైల్వే స్టేడియంలో శుక్రవారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. తొలి బౌట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాక్సర్ల నైపుణ్యాలు, సామర్థ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ఈకోర్స్ వాల్తేర్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి క్రీడా సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. ఆగస్టు 11వ తేదీ వరకు బాక్సింగ్ శిక్షణ శిబిరం జరుగుతుంది. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, బాక్సింగ్ శిక్షణార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యవంతులకు అవకాశాలు

సీతంపేట: వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో 'సేల్స్ ఫోర్స్ విత్ ట్రైల్‌హెడ్' అనే అంశంపై కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ నిర్వహించింది. ఈ సందర్భంగా వక్త శ్యామ్ కొండక మాట్లాడుతూ సేల్స్ ఫోర్స్ అనేది కస్టమర్ రిలేషన్ షిప్ మేనేజ్‌మెంట్‌కు ఒక మంచి వేదిక వంటిదన్నారు. సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున నైపుణ్యం గల ఇంజినీర్లకు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. కాలిఫోర్నియాలోని సేల్స్ ఫోర్స్‌కు చెందిన కంపెనీలో ఉన్న వివిధ అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రొఫెసర్ దీపక్ చౌదరి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డి.మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి

మద్దిలపాలెం: ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులు కథలు, కవితలు చదవడం ఇష్టపడేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ప్రముఖ కథా రచయిత మేడా మస్తాన్‌రెడ్డి అన్నారు. శివాజీపాలెంలో గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ×చదవడం నా కిష్టం×కార్యక్రమాన్ని విశాఖ సంస్కృతి సంపాదకుడు సన్యాసిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ చదవడంలో ఆసక్తి కలిగేలా కథలతో చూడిన పుస్తకాలు విద్యార్థులకు అందించాలన్నారు. అలాంటి పుస్తకాలు అంటే చదడానికి ఇష్టపడతారన్నారు. ఈ సందర్భంగా 100 ఆంగ్ల, తెలుగు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ పుస్తకాలు విద్యార్థులు చదివేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాకుమారి, ఉపాధ్యాయురాలు ఉమాగాంధీ, సన్యాసిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



విద్యార్థినులతో మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులోని లలితానగర్, జ్ఞాననికేతన్ స్కూల్, సాక్షి ఆఫీస్, మారుతి ఆశ్రమం, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జ్ఞాననికేతన్ స్కూల్‌లో విద్యార్థినులతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని కె.కె.రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, డైరెక్టర్లు పాండవ శ్రీను, రాయుడు శ్రీను, ఏపీడీ దుర్గాప్రసాద్, స్థానిక నాయకులు అమ్మాజీ, నవాబ్, శేషు, బాబ్‌జాన్, ఫారూఖీ, వియజ్‌పాల్, సుశీల, రమాదేవి, వరలక్ష్మి, ప్రకాష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాల భవనం పరిశీలన



శాంతినగర్ పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్, ఏడీసీ శ్రీనివాస్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్‌లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఏడీసీ శ్రీనివాస్ సందర్శించారు. ఈ స్కూల్ శిథిలావస్థకు చేరడంతో ఇటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు.. అటు విద్యార్థులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాఠశాల భవనాన్ని వారు పరిశీలించారు. అదే భవనంలో శాంతినగర్ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, వార్డు శానిటరీ కార్యాలయం నడుస్తున్నాయి. దీంతో నూతన భవనం నిర్మించాలని ఆయా ఉద్యోగులు విజ్ఞప్తి చేసి వారికి వినతిపత్రాలు అందజేశారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేటట్లు చూడాలని ఏడీసీ శ్రీనివాస్‌ను కోరారు. అనంతరం పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని డిప్యూటీ మేయర్, ఏడీసీలు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన ఆరుగురి అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఆరుగురు యువకులను ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా.. స్టేషన్ పరిధి రైల్వే న్యూకాలనీలోని ఒక ఇంట్లో గంజాయి ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బందితో సోదాలు చేశారు. ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఆరో వ్యక్తి పరారీ కావడంతో శుక్రవారం అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అలంకారి పోలురాజు(రవీంద్రనగర్, ఆరిలోవ), గిర్ల సురేంద్ర(జీకే వీధి), పోతరంగి చిన్నం నాయుడు(వైఎస్సార్ జిల్లా), కోళ్లపారి శ్రీనుబాబు (జి.మాడుగుల), తిరువాడ చలపతి(కంచరపాలెం), ఆరో వ్యక్తి రాజారావు(పెద్దబయలు)ను రిమాండ్‌కు తరలించారు. రాజారావు అనే వ్యక్తి ఏజెన్సీ ప్రాంతాల నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చి, ఈ ఐదుగురు యువకులకు ఇచ్చేవాడు.

స్ఫూర్తిప్రదాత దుర్గాబాయి దేశ్‌ముఖ్



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూక్యాంపస్: మహిళా సాధికారతకు నిదర్శనంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ నిలుస్తారని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. నరసింహారావు అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జన్మదిన వేడుకల్లో భాగంగా కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ఎంపవర్‌మెంట్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని మహిళా అభ్యున్నతికి పాటుపడిన దుర్గాభాయి దేశ్‌ముఖ్ వ్యక్తిత్వం గురించి వివరించారు. కేంద్ర సంచాలకులు డాక్టర్ పి.ఉష మాట్లాడుతూ అంతర్గత నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటూ ప్రతి మహిళ విజయాన్ని అందుకోవాలన్నారు. రాంకీ ఫౌండేషన్ అధిపతి కె.శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళా సాధికారత, యుక్తవయసు కలిగిన బాలికల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్రం సలహాదారు పీల నాగ వెంకట లక్ష్మి, అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.పుల్లారావు, హిమబిందు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.సాంబశివరావు, కిరణ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్రైడే-డ్రైడే'లో అందరూ భాగస్వాములు కండి



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్

మద్దిలపాలెం: దోమల నివారణకు ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ అన్నారు. జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జీవీఎంసీ యాంటీ మలేరియా బృందం కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి పరిసరాలలో నీటి నిల్వలుంటే వాటిలో లార్వా ఉన్నదీ లేనిదీ గుర్తించాలని సూచించారు. ఇంట్లో ఉండే వారికి తగిన సూచనలు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం వారందరూ వారి ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారం పైబడి నీరు నిల్వ ఉంటే దోమలు ఉత్పత్తి అవుతాయనే విషయాన్ని వివరించాలన్నారు. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు అవుతుండడంతో యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- 24, 25 వార్డుల్లో పర్యటన



25వ వార్డు రెల్లి వీధిలో నివాసులతో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



24వ వార్డు కాలువలో వ్యర్థాలు తీయిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతమ్మధార: వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ సూచించారు. 24వ వార్డు రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం ప్రాంతాల్లో శుక్రవారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. నక్కవానిపాలెంలో శిథిలావస్థలో ఉన్న వివేకానంద కల్యాణ మండపాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని, దాని పక్కనే ఉన్న ఇందిరా గాంధీ పార్కును ఆధునికీకరించాలని ఆదేశించారు. రేసపువానిపాలెంలో భూగర్భ డ్రైనేజీ ప్రధాన పైప్‌లైన్‌ను అనుసంధానించాలని కమిషనర్ దృష్టికి కార్పొరేటర్ తీసుకురాగా.. ఆయన సానుకూలంగా స్పందించి పరిశీలిస్తానని చెప్పారు. వార్డులో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా నిర్వహించడం లేదని, వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని సాయికాంత్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార రైతుబజార్ వరకు రహదారిని విస్తరించేందుకు ఆయా ప్రాంతాల్లో పరిశీలించారు. పర్యటనలో ఇంజినీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, గృహసారథులు, పార్టీ నాయకుడు సాడి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు

రెల్లి వీధిలో సమస్యల పరిశీలన

సీతంపేట: స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ వార్డులోని రెల్లి వీధి నుంచి బుల్లయ్య కళాశాల రహదారికి కనెక్టవిటీ రోడ్డును, 1999లో మంజూరై సగంలో నిలిచిపోయిన స్కీం ఇళ్ల సమస్యను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన శుక్రవారం ఉదయం 25వ వార్డులో కార్పొరేటర్‌తో కలిసి పర్యటించారు. ఇళ్లు సగంలో ఆగిపోవడంతో 20 ఏళ్లుగా రెల్లి వీధిలోని రోడ్డుపై రేకుల షెడ్‌ల్లో నివసిస్తున్న లబ్ధిదారులు వారి సమస్యను కమిషనర్‌కు వివరించారు. రెల్లి వీధి నుంచి బుల్లయ్య కళాశాల వరకు అనుసంధానం చేసి రోడ్డు నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందని కాలనీ వాసులు కోరారు. దీంతో ఆయా ప్రాంతాలను కమిషనర్ పరిశీలించి సానుకూలంగా స్పందించారు. సీఎంవోహెచ్ నరేష్‌కుమార్, ఎస్ఈ సత్యనారాయణ, జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, ఏసీపీ శాస్త్రి, డీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీరామమూర్తి, సచివాలయ కార్యదర్శులు, వార్డు యూత్ అధ్యక్షుడు సన్నీ, బొమ్మాళి రవి, గుడివాడ గౌరినాయుడు, ఉప్పిలి అప్పన్న పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. రూ.500 చెల్లించిన దంపతులను లేదా ఇద్దరిని పూజలకు అనుమతిస్తామన్నారు. భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

టీచ్‌రోడ్డు: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. రామ్‌నగర్‌లోని ఓ ఆసుపత్రిలో పని చేస్తున్న వెంకట సూర్య(46) అదే ప్రాంతంలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. మద్యానికి అలవాటు పడిన సూర్య శుక్రవారం ఎవరూ ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నిర్మూలనకు మెగా ఫాగింగ్



అక్కయ్యపాలెంలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ జ్వరాలను వ్యాప్తి చేసే దోమల నిర్మూలనకు జీవీఎంసీ మలేరియా విభాగం శుక్రవారం సాయంత్రం 26వ వార్డులోని పలు ప్రాంతాల్లో మెగా ఫాగింగ్ చేపట్టింది. ఎన్జీజీవోస్ కాలనీలోని పలు వీధులు, శాంతిపురం, 80 ఫీట్ రోడ్డు ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షా కాలం ప్రారంభం కావడంతో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో వాన నీరు, తాగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వారానికి ఒక రోజు డ్రైడే పాటించి నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులను శుభ్రపర్చి మళ్లీ నీరు పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.ఎ స్.ఎస్.నారాయణ, శివ పాల్గొన్నారు.

పోలీసులు దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి : పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ సిబ్బంది చేసిన కవాతును సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కవాతుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని, 8వ బెటాలియన్‌లో ఉన్నప్పుడు పరేడ్‌కు మరింత ప్రాధాన్యమిచ్చేవాడినన్నారు. 2006లో రాష్ట్ర స్వాతంత్ర్య దినోత్సవంలో పరేడ్ కమాండర్‌గా చేయడంతో తనకు కవాతుపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఏఆర్ సిబ్బంది చేసిన కవాతును, టర్న్ ఔట్‌ను అభినందించారు. ఏఆర్ సిబ్బంది బందోబస్తుల కంటే ఎక్కువగా ప్రిజన్ ఎస్కార్ట్ డ్యూటీలు, గార్డు డ్యూటీలు, వీఐపీ ఎస్కార్ట్‌లు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివాస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిబ్బందికి శాఖాపరమైన అంశాలలో ఏదైనా సమస్య ఉంటే నెలలో కచ్చితంగా ఒక శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని వివరించారు. సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. అనంతరం గ్రీవెన్స్ ఏర్పాటు చేసి 11 మంది నగర ఏఆర్ సిబ్బంది నుంచి వినతులు తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ (ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో సాంకేతిక విప్లవం



మల్లేశ్వరరావును అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఉపాధి అవకాశాలు'అనే అంశంపై విభాగ పూర్వ విద్యార్థి, అమెరికాలోని బైట్ లింక్ సంస్థ సీఈవో డాక్టర్ వై.మల్లేశ్వరరావు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఏఐ, ఎంఐపై అవగాహన కల్పిస్తూ సాంకేతిక మార్పులకు ఇవి దోహదపడుతున్న విధానం వివరించారు. ఇంధన వెలికితీతలో వీటి ప్రాధాన్యతలను తెలియజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సీవీ నాయుడు, విభాగం అడ్జంక్ట్ ప్రొఫెసర్ జి. శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం డాక్టర్ వై.మల్లేశ్వరరావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. వర్సిటీ తరఫున మల్లేశ్వరరావును వీసీ సత్కరించి అభినందించారు.